ప్రత్యేక ప్రతిపత్తి రద్దు పరిష్కారమా?

తప్పుడు పరిష్కార ప్రయత్నాల వల్ల – సమస్యలు జటిలమయినప్పుడల్లా చేసిన తప్పులనే మరింత సమగ్రంగా చేస్తే సమస్య పరిష్కారమయి పోతుందని సలహా ఇచ్చే వాళ్ళు ఎప్పుడూ వుంటారు. ఎంతోమంది సిక్కు యువకులను చంపినా కూడా 'పంజాబు సమస్య' పరిష్కారం కాలేదు కదా అంటే ఆ దమనకాండను అర్ధాంతరంగా ఆపేయకుండా చివరిదాకా కొనసాగిస్తే సమస్య పరిష్కారం కాకపోయేదా అని ఎదురు జవాబు చెప్పే వాళ్ళు చాలామంది ఉన్నారు. అందరినీ చంపేస్తే సమస్యే మిగలదు కదా!

ఆర్టికల్ 370 ఉండటం వల్ల 'కశ్మీర్ సమస్య' ఉత్పన్నమయిందనీ, దానిని రద్దు చేస్తే పరిష్కారం అయిపోతుందనీ వినవస్తున్న వాదన ఈ కోవకు చెందినదే. ఆర్టికల్ 370 వుండటం వల్ల సమస్య రాలేదు. దానిని గౌరవించకపోవడం వల్లనే సమస్య ఉత్పన్నమయ్యింది. ఆర్టికల్ 370లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తిని కేంద్రప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం వమ్ము చేసింది. 1953లో షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని అన్యాయంగా బర్తరఫ్ చేసి, అతనిని అరెస్టు చేసి, 1954లో కశ్మీర్ మీద కేంద్ర ప్రభుత్వానికి సకల శాసన అధికారాలూ ఇచ్చే 'రాజ్యాంగం (జమ్మూ–కశ్మీర్ సంబంధిత) ఆర్డర్'ను జారీ చేసి 1957లో జవహర్‌లాల్ నెహ్రూ 'కశ్మీర్ విలీనం ఒక నిర్వివాదమయిన చారిత్రక వాస్తవం' అని ప్రకటించి, ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని 1947లో కశ్మీర్ ప్రజలకిచ్చిన హామీని బుట్టదాఖలు చేసిననాడే ఆర్టికల్ 370 అసహజమరణం పాలయింది. ఆపైన అది కేవలం అలంకారప్రాయంగా మట్టుకే రాజ్యాంగంలో కొనసాగుతూ వుంది. ఇవ్వాళ దానిని పునరుద్ధరించడం భారత ప్రభుత్వ నైతిక బాధ్యత.

ఈ మాటలు చాలామందికి కోపం తెప్పిస్తాయి. పాకిస్తాన్ ఒక వైపు భారత భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి కాలు దువ్వుతుంటే ఈ మాటలేమిటని అంటారు. ఎన్నాళ్ళని ముస్లింలకు భయపడుతూ బతుకుతాం అని హిందువులు అడుగుతారు. వాళ్ళు డిమాండు చేశారు కాబట్టి ఏ రాష్ట్రానికీ లేని స్వయంప్రతిపత్తి కశ్మీర్‌కు ఇచ్చేయవలసిందేనా అని ఆవేశపడతారు. ఆవేశాలకు లోనుకాకుండా వాస్తవాలు తెలుసుకోవడం అవసరం. పుక్కిటి పురాణాలపై విశ్వాసముంచకుండా హేతుబద్ధంగా

ఉదయం దినపత్రిక, 3–4–1990

వివేచించడం అవసరం. దేశమంటే మట్టి అనుకునే దేశభక్తి మనుషులకు అన్యాయం చేస్తుంది. కశ్మీర్ సమస్య పాకిస్తాన్ దేశభక్తికీ, భారత దేశభక్తికీ సంబంధించిన సమస్య కాదు. అది కశ్మీరీ ప్రజల సమస్య. ఆ మాటే 40 ఏళ్ళుగా కశ్మీర్ ప్రజలు మనకు చెప్పాలని ప్రయత్నం చేస్తున్నారు. అయితే వాళ్ళు మాట్లాడుదామని నోరు తెరచినప్పుడల్లా 'అదిగో పాకిస్తానీ ఏజెంట్లు' అని మనం వాళ్ళ నోళ్ళు నొక్కేస్తున్నాం. షేక్ అబ్దుల్లా నుండి ఇప్పుడు కశ్మీర్ లోయలో అత్యధిక జనాదరణ పొందుతున్న జమ్మూ కశ్మీర్ విమోచనా సంస్థ (జె.కె.ఎల్.ఎఫ్) దాకా కశ్మీరీ రాజకీయాల ప్రముఖ ప్రతినిధులంతా కశ్మీరీ జాతీయవాదులే గానీ పాకిస్తానీ ఏజెంట్లూ కాదు, మతతత్వవాదులూ కాదు. పాకిస్తాన్ ఏజెంట్లూ మతతత్వవాదులూ లేకపోలేదు గానీ వాళ్ళ ప్రాబల్యం అల్పమే. తక్కిన భారతదేశం కశ్మీరీ జాతీయవాదాన్ని గుర్తించడానికి నిరాకరించి పాకిస్తానీ బూచినీ, మతతత్వం బూచినీ రెచ్చగొడుతూ పోతే ఆ ప్రాబల్యం ఎంతో కాలం అల్పస్థాయిలో వుండదు. కనీసం ఆ దృష్టితోనయినా మనం కొంచెం హేతుబద్ధంగా ఆలోచించాలి.

ఆర్టికల్ 370 ముస్లిం మతతత్వవాదులు కుట్రచేసి సాధించుకున్నది గాదు. నెహ్రూను బ్లాక్‌మెయిల్ చేసి షేక్ అబ్దుల్లా సాధించుకున్నదీ గాదు. భారత రాజ్యాంగసభ దానిని కూలంకషంగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆర్టికల్ 370ని రాజ్యాంగ సభలో ప్రతిపాదించిన శ్రీ గోపాలస్వామి అయ్యంగార్ ఎటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఆ ఆర్టికల్‌ను ప్రతిపాదించవలసి వస్తున్నదో వివరించారు. ఆ ప్రత్యేక పరిస్థితులేమిటో మనం కొంచెం గుర్తుచేసుకోవాలి.

బ్రిటిష్‌వాళ్ళు భారత ఉప ఖండం మొత్తాన్ని ఏ రోజూ ప్రత్యక్షంగా పరిపాలించలేదు. అందులో సగభాగం మటుకే బ్రిటిష్ పాలిత ప్రాంతం. తక్కిన భూభాగంలో చిన్న పెద్ద రాజ్యాలూ, సంస్థానాలూ, జాగీరులూ వుండేవి. వీటిలో హైదరాబాద్, భోపాల్, జమ్మూ కశ్మీర్ పెద్దవి. అయితే వీటన్నిటి మీదా బ్రిటిష్ ప్రభుత్వం తన సార్వభౌమత్వాన్ని ప్రకటించుకుంది. ఈ రాజులు, సంస్థానాధీశులు బ్రిటిష్ ప్రభుత్వానికి కప్పం చెల్లించడమేగాక ఇతర విషయాల్లోనూ లోబడి వుండేవారు. అయినా వాళ్ళకు ఏదో ఒక మేరకు పరిపాలన స్వయంప్రతిపత్తి వుండేది. కొన్ని రాజ్యాలకు శాసనసభలూ రాజ్యాంగ సభలూ కూడా వుండేవి. బ్రిటిష్ వాళ్ళు గనుక భారతదేశాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతే వాళ్ళతోపాటే వాళ్ళ సార్వభౌమత్వమూ పోవాలనీ, తాము తిరిగి సర్వ స్వతంత్రులు కావాలనీ ఈ రాజులూ, సంస్థానాధీశులూ కోరుకున్నారు. సైమన్ కమిషన్ (1927) నుంచి కాబినెట్ రాయబారం (1947) దాకా అందరికీ వాళ్ళు ఇదే మొరపెట్టుకున్నారు.

కాంగ్రెస్ వారి జాతీయ ఉద్యమం ఈ రాచరికాల పట్ల విచిత్రమైన ద్వంద్వ వైఖరిని అవలంబించింది. ఒక పక్క వాళ్ళను బ్రిటిష్ ఏజెంట్లనీ, మధ్యయుగాల అవశేషాలనీ

విమర్శిస్తూ మరొక పక్క ఆ రాజ్యాలలోకి జాతీయోద్యమం విస్తరించకుండా జాగ్రత్తపడింది. దేశీయ సంస్థానాల్లో జాతీయోద్యమం ఎదగకుండా తానే అడ్డుపడ్డానని గాంధీ సగర్వంగా చెప్పుకున్నాడు కూడా. బ్రిటిష్ పాలిత ప్రాంతాలకు మట్టుకే జాతీయోద్యమాన్ని పరిమితం చేసి బ్రిటిష్ వాళ్ళను ముందు బయటకు తరిమేస్తే ఆ తరువాత స్థానిక రాచరికాలను లొంగదీసుకుని కలుపుకోవచ్చుననేది కాంగ్రెస్ నాయకుల వ్యూహం. ఆ ప్రకారమే స్వాతంత్ర్యానంతరం వారు దేశీయ సంస్థానాలను, రాజ్యాలను ఇండియన్ యూనియన్‌లో చాలా చాకచక్యంగా కలుపుకున్నారు. రాజులను, సంస్థానాధీశులను వివిధ రాజకీయ పార్టీలలో కలుపుకుని మంత్రులుగాను, గవర్నర్లుగాను పునరావాసం కల్పించారు. వాళ్ళ ఆస్తులు కాపాడు కోవడానికీ, కొత్త రూపాలలో పెంపొందించుకోవడానికీ సకల అవకాశాలు కల్పించారు. ఒక్క జమ్మూకశ్మీర్ విషయంలో మట్టుకే ఈ వ్యూహం విఫలం అయింది.

రాజ్యాంగ సభ నిర్ణయించిన ప్రకారం భారతదేశంలో విలీనమయ్యే ప్రతి రాజ్యమూ ఒక 'విలీన ఒడంబడిక' (Instruments of accession) ప్రాతిపదిక మీద విలీనం అవుతుంది. ఆ ఒడంబడిక మీద భారత ప్రభుత్వమూ ఆ రాజ్యపాలకుడయిన రాజూ సంతకం చేస్తారు. ఆ రాజ్యం మీద కేంద్ర ప్రభుత్వం అజమాయిషీ ఏ మేరకు వుండేది, రాజ్యానికి స్వయంప్రతిపత్తి ఏ మేరకు ఉండేది ఒడంబడిక నిర్ణయిస్తుంది. కేంద్రానికి కేవలం విదేశీ వ్యవహారాలు, రక్షణ, రవాణా ప్రసార సాధనాల మీద అధికారం ఇచ్చి మిగిలిన విషయాల్లో రాజ్యానికి స్వయంప్రతిపత్తి వుండాలని చాలామంది సంస్థానాధీశులు భావించారు. అయితే కాంగ్రెస్ నాయకులు రకరకాల ఆశలూ, భయాలూ చూపించి ఏ స్వయంప్రతిపత్తి లేకుండానే ఒక్కొక్క సంస్థానాన్నీ పూర్తిగా లొంగదీసుకున్నారు.

జమ్మూకశ్మీర్ మట్టుకు ఈ ప్రలోభాలకు, భయాలకు లొంగలేదు. నైసర్గికంగా, సాంస్కృతికంగా, భాషాపరంగా ఆ ప్రాంతానికున్న ప్రత్యేకత వల్ల తాము స్వతంత్రంగా వుండిపోవాలని వాళ్ళు ఆశించారు. అందులో తప్పేమీ లేదు. ఆ కోరికను భారత పాకిస్తాన్‌లు గౌరవించి వుంటే కశ్మీర్ వేరే దేశంగా వుండేది. అయితే ఆ సంస్కారం ఈ రెండు దేశాల్లోనూ లేకుండాపోయింది. 1947 అక్టోబర్ 26వ తేదీన పాకిస్తాన్ కశ్మీర్ మీదకి ఒక మూకను పంపించింది. కశ్మీర్ రాజయిన హరిసింగ్ భారతదేశాన్ని శరణు కోరాడు. స్వతంత్రంగా వుండిపోతే తనకు పూర్తి సహాయం దొరకదన్న భయంతో జమ్మూ కశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేయడానికి ఒప్పుకున్నాడు. భారత ప్రభుత్వానికి రక్షణ, విదేశీ వ్యవహారాలు, రవాణా ప్రసార సాధనాల మీద మట్టుకు అధికారం ఇస్తూ ఇతర విషయాల్లో జమ్మూ కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి వుంటుందని ఈ ఒడంబడిక గుర్తించింది. భారత సైన్యాలకూ, పాకిస్తాన్ సైన్యాలకూ ఆపైన యుద్ధం జరిగింది. కొంతకాలం తర్వాత సంధి కుదిరింది. కశ్మీర్ భవితవ్యాన్ని గురించి కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ (Plebiscite)

జరగాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. దానికి కట్టుబడి వుంటామని నెహ్రూ ఒప్పుకున్నాడు కూడా.

గోపాలస్వామి అయ్యంగార్ ఈ విషయాలన్నింటినీ రాజ్యాంగ సభకు నివేదించి వీటిని దృష్టిలో వుంచుకుని రాజ్యాంగంలో కశ్మీర్ స్థానాన్ని నిర్ణయించాలని అన్నాడు. అందుకోసం ఆర్టికల్ 370ని ప్రత్యేకంగా కశ్మీర్ కోసం ప్రతిపాదించాడు. రాజ్యాంగ సభ దానిని చర్చించి ఆమోదించింది. ఆర్టికల్ 370 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి రక్షణ, విదేశీ వ్యవహారాలు, రవాణా ప్రసార సాధనాల మేరకే కశ్మీర్‌లో శాసనాధికారం ఉంటుంది. ఒక విషయం ఈ జాబితాలోకి వస్తుందా లేదా అనేది రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి నిర్ణయించాలి. ఈ మూడు కాక వేరే ఏ విషయాల్లోనయినా భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం శాసనాధికారం కోరుకుంటే ఆ అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వ సమ్మతితో పొందాలి.

ఈ చివరి విషయమే ఆర్టికల్ 370కి ప్రాణాంతకమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో కేంద్రం ఎంతటి శాసనాధికారాన్నయినా పొందవచ్చుననేసరికి కేంద్రానికి వ్యతిరేకమయిన రాష్ట్ర ప్రభుత్వానికి కశ్మీర్‌లో మనుగడే లేకుండా పోయింది. అందుకే కశ్మీర్ ప్రజల ప్రతినిధిగా అద్వితీయ స్థానం కలిగివున్న షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని 1953లో చాలా అన్యాయంగా బర్తరఫ్ చేసి అతనిని అరెస్టు చేశారు. బర్తరఫ్ చేసిన రాష్ట్ర గవర్నర్ కరణ్‌సింగ్ (పాత కశ్మీర్ రాజు హరిసింగ్ కుమారుడు) దేశ రాజకీయాలలో ఆ తరువాత చాలా ప్రముఖుడయ్యాడు. ఈ విధంగా ప్రజా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసిన తరువాత గవర్నర్ సమ్మతితో రాజ్యాంగం (జమ్మూకశ్మీర్ సంబంధిత) ఆర్డర్‌ను 1954లో జారీ చేశారు. దాని ప్రకారం కశ్మీర్‌లో కేంద్రానికి అన్ని విషయాలలోను శాసనాధికారం ఉంటుంది. కశ్మీర్‌కు వేరే రాజ్యాంగం నామమాత్రంగా వున్నా ఆచరణలో ఆ రాష్ట్రం బలవంతంగా ఇతర రాష్ట్రాలలాగా భారతదేశంలో భాగం అయ్యింది. ఆర్టికల్ 370ని రద్దు చేయాలని ఇవ్వాళ కొందరు గొడవచేస్తున్నారు గాని అది ఆనాడే నిస్సారమయ్యింది.

ఆ తర్వాత కూడా జమ్మూ కశ్మీర్‌లో ఏ ఒక్క ఎన్నికనూ ప్రజాస్వామికంగా జరగనీయలేదు. రిగ్గింగ్‌తో, తుపాకులతో, దొంగ ఓట్లతో కేంద్రానికి అనుకూలమయిన వాళ్ళే గెలిచేటట్లు చేశారు. 1975లో షేక్ అబ్దుల్లా ఇందిరాగాంధీతో ఒప్పందం చేసుకొని కశ్మీర్ ప్రత్యేకతను ఇక మరచిపోతాం అని హామీ ఇచ్చిన తర్వాతే ఆయన రాజకీయ స్వేచ్ఛ పొందగలిగారు. అయితే ఆయన మరణానంతరం ముఖ్యమంత్రి అయిన ఫరూక్ అబ్దుల్లా ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలిపి రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని గురించి మాట్లాడడం మొదలెట్టేసరికి అతని ప్రభుత్వాన్ని కూడా 1984లో అక్రమంగా బర్తరఫ్ చేశారు. తిరిగి అతను రాజీవ్‌గాంధీతో ఒప్పందం కుదుర్చుకొని ప్రతిపక్ష కూటమికి గుడ్‌బై కొట్టిన

తర్వాతే అధికారానికి రాగలిగాడు. ప్రజాస్వామ్యాన్ని కశ్మీర్‌లో ఖూనీ చేసినంత సమర్థవంతంగా మన దేశంలో వేరే ఎక్కడా చేయలేదు.

తమ జాతీయ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలని ప్రజలెవరయినా కోరుకోవడం తప్పు కాదు, దేశద్రోహం కాదు. అస్సాంలో అగ్రకుల హిందువులు అదే కోరిక కోరుకుంటే దేశమంతా వాళ్ళను సమర్థించింది. కశ్మీర్‌లో ప్రజలు ముస్లింలు అయ్యేసరికి దేశద్రోహం, వేర్పాటువాదం అంటున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం అసాధ్యమవుతుందన్న విశ్వాసం పోగొడితే ప్రజలు హింసాత్మకమయిన మార్గాలు చేపడతారు. 40 ఏళ్ళుగా కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినప్పుడు మనం మాట్లాడకుండా ఇప్పుడు హింసను గురించి ఆవేదన చెందితే ప్రయోజనం లేదు. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకున్నా ఈనాటి పరిస్థితి ఏమిటంటే కశ్మీర్ లోయలోని మెజారిటీ ప్రజానీకం భారతదేశం పట్ల విముఖత కలిగి ఉంది. ఆర్టికల్ 370లో ఇచ్చిన హామీని గౌరవించి కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నం అయ్యేది కాదేమో! కశ్మీర్ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న షేక్ అబ్దుల్లా వంటి నాయకులకు రాజకీయ స్వేచ్ఛ లేకుండా చేయకుంటే ఈ పరిస్థితి ఉత్పన్నం అయ్యేది కాదేమో! ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడి, కేంద్రానికి అనుకూలమయిన వారినే తప్ప, తమకు ఇష్టం అయిన వారిని ఎన్నుకొనే హక్కు కశ్మీర్ ప్రజలకు లేకుండా చేయకుంటే ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుండా వుండేదేమో! ఇప్పటికయినా 1954 నాటి ఆర్డర్‌ను రద్దుచేసి ఆర్టికల్ 370ని పునరుద్ధరించే ప్రయత్నం చిత్తశుద్ధితో చేస్తే పరిష్కారానికి మార్గం దొరకవచ్చు. దాని బదులు పాకిస్తాన్ బూచి గురించి హెచ్చరికలు చేస్తూ ఈ లోపల శ్రీనగర్‌లోను, అనంతనాగ్‌లోను, బారాముల్లాలోను ప్రతి రోజూ కాల్పులలో డజన్లకొద్దీ జనాన్ని చంపుతూపోతే సమస్య పరిష్కారం కాకపోగా, బ్రహ్మరాక్షసి అయి కూర్చుంటుంది.